# ఎకానమీ

సిగరెట్ నోట్లోపెట్టుకుని, వారపత్రిక తిరగవేస్తో, భార్య కట్టిఇచ్చిన తాంబూలంతోపాటు కొంత జర్దాకూడా బిగించి, దానికోపక్క బుగ్గలో ఆశ్రయమిచ్చి, ఈజీ ఛైరులో ఆసీనుడైవున్న కృష్ణారావుని "ఏమన్డీ!" అంటూ, పనులుముగించి తడిచేతులు చీరెకి తుడుచుకుంటూ, అతని భార్య శ్యామల పిలిచినపిలుపు, ఇహలోకస్ఫురణ కలిగించి, పుస్తకాన్ని మూయించి, ఆవిడగారివైపు అరమోడ్పుగా వీక్షించేలా చేసింది.

"ఏమిటండీ ?"

"పోదురూ! ఎప్పుడు ఏ విషయం మాట్లాడదామని దగ్గరచేరినా ఇలాగే అంటారు"

కోపంనటిస్తూ ప్రక్కనున్న మరో కుర్చీలోకూచుని, సాలోచనగా వేలికొనకు చీరెచెంగును మెలివేయసాగింది.

"సెలవియ్యండీ"

అని అతను మళ్ళా అన్నాడు. శ్యామల ఓ కోరచూపు చూసింది, చిరుకోపంతో.

"వేళాకోళంకాదు. ఏదైనా సీరియస్‌గా చెప్పేటప్పుడు శ్రద్ధగా వినాలి. మీరు చెప్తే నేను విననూ? లేకపోతే నేనసలు చెప్పేదే లేదు. నాకొక్క దానికే కాదుగా సంసార తాపత్రయం పట్టింది? వినకపోతే జరిగేదేదో జరుగుతుంది."

నిర్లక్ష్యంగా అంది. కృష్ణారావు వారపత్రికను పక్కనున్న బల్లమీదపడేశాడు. "విన్నవించ మంటే అంతకోపమొందుకండీ?"

"ఎందుకూ అనవసరంగా ఆ గౌరవవాచకం ప్రయోగిస్తారు, వ్యంగ్యార్థం కాకపోతే? 'చెప్పేదేదో చెప్పు అదెలాగా జరగదులే' అనడం అన్నమాట"

కోపంలోనే చిరునవ్వు, చూచాయగా మొహంపైన మెరిసి మాయమైంది–'కనిపెట్టేశాను మీ లోగుట్టు; తెల్సుకోండి, నా ప్రభావం' అన్నట్టు.

"ప్రేమలో గౌరవవాచకం వాడినా తప్పులేదు. అదీగాక స్త్రీలకు సమాన హక్కులు కావాలంటున్న ఈ రోజుల్లో 'ఏమండీ' అని భార్యల్ని పిలవడం సంస్కారవంతుల కనీస ధర్మం" కృష్ణారావు గుక్క తిప్పుకోకుండా చెప్పసాగాడు.

"ఆపండి ఆ ఉపన్యాసం. తక్కిన స్త్రీల విషయం నాకు తెలీదుగాని, దేముడిపుణ్యమా అని నన్ను అలాపిలవకండి. మీపెద్దలకో నమస్కారం"

"ఇంతకీ నీవనేదేమిటి ?"

"మీ రననిస్తేగా?"

"అనమ నే అనేది"

"విని వొప్పుకుంటానని మాటిఇస్తారా?"

"వింటే కద?"

"వింటారుగా?"

"అసలు విషయమేమిటో?"

"మన కుటుంబంసంగతే!"

"విని, వీలుంటే వొప్పుకుంటాను"

"అదుగో, మళ్ళీ షరతులు పెడుతున్నారు?"

"అది నా కసాధ్యమైనదైతే?"

"అసాధ్యమైనవి నే నెందుకడుగుతానండీ? ఏమన్నా పిచ్చిదాన్ననుకున్నారా?"

"అయితేచెప్పు"

"చేస్తారుకదూ?"

"చేస్తా... వీలుం..."

"ఎల్లుండి అమ్మాయి పుట్టినరోజు పండుగ. ఆరోజు వూళ్లో అందర్నీ పేరంటానికి పిలవాలనివుంది. మీరు కొట్టులో ఖాతాపెట్టో, అప్పుతెచ్చో దానికో గౌను, ఒకవీశె నెయ్యి, ఒకవీశె చక్కెర, శేరు సెనగపిండి, జీడిపప్పు, కిస్మిస్ వగైరా తేవాలి. ఎల్లుండికి రెండు రూపాయల సెనగలూ, ఓ వంద తమలపాకులూ, నాలుగు డజన్ల అరటిపళ్లూ కావాలి"

"చాలా పెద్ద పద్దేవుందే? ఈ నెల ఖర్చుతో ఇంత లిస్టుని పూర్తిచెయ్యడమెట్లా? దానికి ఐదేళొచ్చాయికదా, ఇంకా పుట్టినరోజు పండుగలెందుకూ?"

"అన్నారూ? నేను అలా అంటారనే అనుకున్నాను. డబ్బు ఖర్చవుతుందని పండుగా, పబ్బమూ మానేసుకుంటామండి? షష్టిపూర్తి అయినా పుట్టినరోజు పండుగలు చేసుకుంటున్నారే, పది రూపాయల ఖర్చు కోసం వద్దంటున్నారా?"

శ్యామల ప్రాధేయపూర్వకంగానే అంది.

"రూపాయలకోసం కాదు; అసలు నాకు పుట్టిన రోజు పండుగల్లోనే నమ్మకం లేదు"

"ఎల్లుండి అమ్మాయి పుట్టినరోజు కాదంటారా?"

"అవ్వచ్చు"

"అయితే దానిలో నమ్మకం లేకపోవడమేమిటీ?"

"పుట్టిన రోజులో కాదు; పండుగలో లేదన్నా."

"అదేం వీల్లేదు ఇది ఆడవాళ్ళ విషయానికి సంబంధించినది. ఆ మాత్ర స్వయం నిర్ణయాధికారం మాకూ వుంది. మీకు చెప్పిన సరకులు తెచ్చి పడేయండంతే!"

"నెలాఖరులో పది రూపాయలు మాత్రం?"

"అప్పు చెయ్యండి"

"తీర్చే విధానం?"

"ఎలాగో అలా తేండి. మీకు ఆవేళ రాత్రే ఆ డబ్బు ఇస్తాను, సరా?"

"ఎట్లా ఇస్తావ్?"

"మీరే చూద్దురుగాని"

"అయితే సరే"

అప్పటికి శ్యామల మనస్సు కుదుటపడింది. దీర్ఘంగా నిట్టూర్చింది.

"ఎందుకా నిట్టూర్పు?"

"ఎంతగా వాదించారు. అంతా నాకే మేలు చేస్తున్నట్టు"

"నా కిష్టంలేక కాదు-బడ్జెట్ లేదుగా" చిరునవ్వు నవ్వాడు; విషాదకరంగా.

శ్యామలా నవ్వింది "ఇండియా ఆర్థిక మంత్రిత్వ స్థానం ఖాళీ అయింది ఆ స్థానం సంపాదించండి. మీచేతినుండి డబ్బు రాలక పంచవర్ష ప్రణాళిక పడుక్కుంటుంది"

"ఏమో దశ ఎలా మారుతుందో? ప్రస్తుతము ఐఎఎస్‌కి కదుతున్నాంగా?"

ఇంతలోకి అమ్మాయి నిద్దట్లో కలవరించసాగింది. శ్యామల లేచివెళ్ళి, జోకొడుతూ.

"నే చూస్తాన్లే, అమ్మా, నీ పుట్టినరోజు పండుగ. ఎందుకు జరగదో ?... ఏమండోయ్, ఆ లైట్ ఆర్పండి, అమ్మాయికి దోమలు కుడుతున్నాయి" అంది.

"చిత్తం, దేవిగారూ" అంటూ కృష్ణారావు లేచాడు. శ్యామల మనస్సులోనే నవ్వు కోసాగింది.

పుట్టిన రోజు పండుగ దివ్యంగా జరిగింది. ఆ వేళ సాయంత్రం ఇంటినిండా వనితాలోకం వుంటుందని ఆఫీసునుండే బజారు వైపు వెళ్ళాడు కృష్ణారావు.

అతను తిరిగి తిరిగి వొచ్చేటప్పటికి ఎనిమిదైంది. ఇల్లంతా సుగంధ ద్రవ్యాల్తో గుబాళిస్తోంది. అక్కడక్కడ రాలిన అక్షింతలూ, సెనగలూ పేరంటపు వైభవాన్ని చాటుతున్నాయి.

శ్యామల సిల్కు బట్టలు వొదల్లేదు. అతని దుస్తుల్ని అందుకుని స్టాండుకి తగిలించింది.

"అమ్మాయి, నాన్నారికి దణ్ణంపెట్టా! అంటూ చూసి చూసి నిద్దరోయింది" అంది శ్యామల, తను నమస్కరిస్తూ.

నువ్వెందుకు నమస్కరించడం నీ పుట్టిన రోజుకాదుగా" అన్నాడు కృష్ణారావు.

"నా కూతురి బదులు"

భోజనం దగ్గర ప్రత్యక్షమైన మిఠాయి. పాతాళించిన సెనగలూ, అరటిపండ్లతో అనుకోకుండానే ఎక్కువ తిన్నాడు కృష్ణారావు.

పనులు పూర్తి చేసుకొచ్చాక శ్యామల, "మీకెంత ఖర్చయిందన్నారు ?" అని అడిగింది.

"11-14-0"

"అయితే ఈ పన్నెండు రూపాయలూ తీసుకోండి. మీరు అమ్మాయి పుట్టిన రోజు పండుక్కి ఏమీ ఖర్చు పెట్టలేదని జ్ఞాపకముంచుకోండి" అంది సగర్వంగా.

"ఎక్కడిదీడబ్బు?"

"పేరంటాళ్ళిచ్చారు. ఇవిగో మరో అయిదు"

"ఎందుకు తీసుకున్నావ్?"

"అమ్మాయికి ప్రెజెంట్ చేశారు"

"బాగానే వుంది; ఐదురూపాయలు ఆదా అన్నమాట మంచి ఎకానమీయే" అన్నాడు కృష్ణారావు నవ్వుతో.

"మరో సంవత్సరం గడిచింది. అమ్మాయి పుట్టినరోజు రేపనగా కృష్ణారావు 'భార్య ఆ విషయం అడగదేమా?' అన్న ఆలోచనలో పడ్డాడు.

చూసి చూసి చివరికి అతనే అన్నాడు:

"రేపు అమ్మాయి పుట్టినరోజు జరపవూ?"

"జరుపుతాను"

"సెనగలూ, మిఠాయిలూ, గౌనూ అన్నీ బజారులోనే కొని తెస్తానులే"

"అవేం వొద్దులెండి ఒక్క గౌను తెస్తే చాలు."

"ఏం," అలా అంటున్నావ్? ఇందులో మనకేమీ తగిలేదిలేదుగా. పేరంటాళ్ళనుండి బాగానే వసూలౌతుందికదూ" ఉత్సాహంతో కృష్ణారావు మరీమరీ హెచ్చరించసాగాడు.

"వద్దన్నాగా"

"ఇదే ఆడవాళ్లతో చిక్కు. అవునంటే కాదంటారు, కాదంటే అవునంటారు"

"మీకు తెలీదు ఊరుకుందురూ?"

"అలా వీల్లేదు దాని పుట్టినరోజు పండుగ చేసి తీరాల్సిందే?"

"వద్దుబాబూ వద్దు"

"ఏం ఎందుకు వద్దు? అమ్మాయి మీద నాకు ప్రేమ లేదనుకున్నావా! నిరుడు ఏదో తమాషాకన్నా నంతే - నీహృదయం కనుక్కుందామని. అందువల్ల రేపు పొద్దున్నే వెళ్లి అందర్నీ పిలిచి పండుగ మామూలుగా చెయ్యి. నేను అన్నీ తెచ్చిపడేస్తాను"

"ఈ లిస్టుచూసి మరీమాట్లాడండి" అని శ్యామల ఓ కాగితం అందించింది. కృష్ణారావు చదువుకుని వివర్ణుడవసాగాడు. చివరికి కాగితం కింద వొదిలేశాడు, కుర్చీలో కూలబడుతూ.

"ఏమంటారు?" అంది శ్యామల.

"సరేలే నీయిష్టం" అని కృష్ణారావు చప్పబడ్డాడు.

ఆ కాగితంలో ఇలావుంది -

| | | | |
|---|---|---|---|
| డిప్టీకలక్టరు గారింట్లో పేరంటంలో ఇచ్చినవి | ... | ... | 5-0-0 |
| తహశీల్దార్ | ... | ... | 5-0-0 |
| హెడ్‌మాష్టర్ | ... | ... | 5-0-0 |
| అసిస్టెంట్ సివిల్ సర్జన్ | ... | ... | 5-0-0 |
| లేడీ డాక్టర్ | ... | ... | 3-0-0 |
| ఇతర స్నేహితురాళ్ల ఇళ్ళల్లో | ... | ... | 20-0-0 |
| మొత్తం | | ... | 43-0-0 |
| మనకు వచ్చినది. | (-) | ... | 17-0-0 |
| వెరసి నష్టం | | | 26-0-0 |

"అమ్మాయికి ఓ గౌను తెండిచాలు. మన ఇంట్లోనే జరుపుకుందాం పుట్టిన రోజు పండుగ సరదాగా" అంది శ్యామల ఓదార్పుగా.

*17.10.1956-ఆంధ్ర సచిత్ర వారపత్రిక*